క్లుప్తంగా

హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

గజపతినగరం రూరల్: దావాలపేట గ్రామంలో మహంకాళ్లమ్మ వారి ఆలయం హుండీ ఆదాయాన్ని అర్చకులు, గ్రామపెద్ద బూడి వెంకటరావు మాస్టారు ఆధ్వర్యంలో సోమవారం లెక్కించారు. రూ.3,01,850 ఆదాయం వచ్చిందని, వీటిని ఆలయ అభివృద్ధికి ఖర్చు చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రహరీ నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరు


ప్రహరీ నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

గజపతినగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి ప్రహరీ నిర్మాణానికి మండల పరిషత్ నిధులు రూ.20 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో ప్రహరీ నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.ఎస్.వి.ఎస్.ప్రసాద్ సిబ్బందితో సోమవారం కొలతలు వేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీపీతో సంప్రదించి పనులు త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు. ఏఈఈ పి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం


ఉపాధి పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ ఈశ్వరరావు

గజపతినగరం రూరల్: మండలంలోని కాళం రాజుపేట పంచాయతీ పరిధిలోని సీతసాగరం చెరువులో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ నూతన పనులను సర్పంచ్ గేదెల ఈశ్వరరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులతో గ్రామీణ ప్రాంతాల్లో వలసలకు చెక్ పడిందని అన్నారు. సీతసాగరం చెరువు పనికి రూ.25 లక్షల నిధులను అధికారులు కేటాయించారని, 240 మంది వేతనదారులు తొలిరోజు పనికి హాజరయ్యారని చెప్పారు.

ఫీల్డ్ అసిస్టెంట్ నియామకం


ఫీల్డ్ అసిస్టెంట్‌కు నియామకపత్రం అందచేస్తున్న ఎంపీపీ సింహాద్రిఅప్పలనాయుడు

దత్తిరాజేరు: మండలంలోని ఇంగిలాపల్లి పంచాయతీ ఉపాధి హామీ క్షేత్ర సహాయకురాలిగా నియమితులైన మజ్జి శైలజకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు సోమవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న వేతనదారులందరికీ పనికల్పించేలా, ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ఠ వేతనం అందేలా వారితో పనులు చేయించాలని సూచించారు. వైస్ ఎంపీపీ బమ్మిడి అప్పలనాయుడు, పోరలి పీఏసీఎస్ అధ్యక్షుడు సుమల శ్రీనివాసరావు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఏపీఓ వెంకటప్పలనాయుడు పాల్గొన్నారు.

6న పీడీఎస్ బియ్యం వేలం

కొత్తవలస: మండలంలోని వీరభద్రపురం గ్రామంలో అక్రమంగా నిల్వచేసిన 67.22 క్వింటాళ్ల పీడీఎస్(రేషన్) బియ్యాన్ని అధికారులు గతంలో సీజ్ చేశారు. ఈ బియ్యానికి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని పౌరసరఫరాలశాఖ గొడౌన్ వద్ద ఈనెల 6వ తేదీన వేలంపాట నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ హేమంత్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ 2 వేలు ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

గజపతినగరం: తమకు ఉద్యోగ భద్రత, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరుతూ గ్రీన్‌అంబాసిడర్లు సీఐటీయూ జిల్లా కార్య దర్శి వి.లక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ జీతాలు పెంచాలని, ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. భద్రత పరికరాలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ పప్పు సుదర్శనంకు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాస్, కె.రాము, కె.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదోతరగతి పరీక్షలు


దత్తిరాజేరు మండలంలోని మరడాం ఉన్నత పాఠశాలలో పరీక్షకు హాజరైన విద్యార్థులు


చీపురుపల్లి గురుకుల పాఠశాల కేంద్రంలోకి పరీక్ష రాసేందుకు వెళుతున్న విద్యార్థులు


వేపాడ ఉన్నత పాఠశాలలో పరీక్షకు హాజరైన విద్యార్థులు


లక్కవరపుకోట హైస్కూల్ వద్ద పరీక్ష కేంద్రంలోకి వెళ్లేందుకు వేచి ఉన్న విద్యార్థులు


కొత్తవలసలోని మోడల్ స్కూల్ నుంచి పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు


జామి ఉన్నత పాఠశాలలో పరిశీలిస్తున్న తహసీల్దార్ హేమంత్ కుమార్


మెరకముడిదాం మండలం గర్భాంలో రూమ్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు


గజపతినగరం బాలుర హైస్కూల్ వద్ద పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న సీఐ అప్పలనాయుడు


గొట్లాం హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా


వేపాడలో పరీక్ష కేంద్రంలోకి వెళ్లేందుకు వేచి చూస్తున్న విద్యార్థులు

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఈ నెల 18వ తేదీ వరకు రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. తొలిరోజు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పరీక్ష కేంద్రాల వద్ద సందడి నెలకొంది. కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించారు. మాస్‌కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. పరీక్ష కేంద్రాలను ఎంఈఓలు, తహసీల్దార్‌లు, పోలీసు అధికారులు సందర్శించారు.

- చీపురుపల్లి మండలంలో ఆరు కేంద్రాల్లో పరీక్షలకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాల, సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, మెట్టపల్లి, పెదనడిపల్లి ఉన్నత పాఠశాలలు, సిద్ధార్థ పాఠశాలలోని కేంద్రాల్లో 1001 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 993 మంది హాజరయ్యారు.
- గరివిడి మండలంలో గరివిడి, కొండపాలెం, కోనూరు ఉన్నత పాఠశాలల్లోని కేంద్రాల్లో 610 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 608 మంది హాజరయ్యారు.
- వేపాడ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రానికి 206 మందిని, విక్టరీ హైస్కూల్‌లోని కేంద్రానికి 146 మంది విద్యుర్థులను కేటాయించగా శతశాతం హాజరయ్యారు. కొండగంగుబూడి గిరిజన ఆశ్రమ పాఠశాలలోని కేంద్రంలో 76 మంది విద్యార్థులు పరీక్షల రాశారు.
- బొండపల్లి మండలంలోని గొట్లాం గాయిత్రీ టెక్నో స్కూల్ గొట్లాం, బొండపల్లి ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాలకు 519 మంది విద్యార్థులను కేటాయించగా పూర్తిస్థాయిలో హాజరయ్యారు. తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు.
- గజపతినగరం మండలంలో గజపతినగరం బాలుర,బాలికోన్నత పాఠశాలలు, మరుపల్లిలోని మోడల్ స్కూల్, హర్షవర్ధన్ స్కూల్ కేంద్రాలుగా పరీక్షలు నిర్వహించారు.ఆయా కేంద్రాలను సీఐ అప్పలనాయుడు సందర్శించారు.
- దత్తిరాజేరు మండలంలోని మరడాం ఉన్నత పాఠశాలలో 249 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 247 మంది హాజరయ్యారని ఎంఈఓ వెంకటరావు తెలిపారు. పెదమానాపురంలో 152 మంది, దత్తిరాజేరులో 140 మంది పరీక్ష రాశారు.
- కొత్తవలస మండలంలోని వియ్యంపేట, కొత్తవలస ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్, ఓపీ జిందాల్ భారత్ విద్యామందిర్ స్కూల్ కేంద్రాలుగా పరీక్షలు నిర్వహించారు. ఈ కేంద్రాల్లో 987 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా తొలిరోజు శతశాతం హాజర యారు.
- లక్కవరపుకోట మండలంలోని మోడల్ స్కూల్, ఎల్.కోట హైస్కూల్ కేంద్రాల్లో 473 మంది విద్యార్థులకు పూర్తిస్థాయిలో హాజరయ్యారు.
- జామి మండలంలోని జామి, అలమండ, కుమరాం ఉన్నత పాఠశాలల్లోని పరీక్ష కేంద్రాల్లో 670 మంది పరీక్షలకు హాజరయ్యారని తహసీల్దార్ హేమంత్ కుమార్ తెలిపారు.
- మెరకముడిదాం మండలంలో మెరకముడిదాం ఉన్నత పాఠశాలలో 280 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 278 మంది, గర్భాం ఉన్నతపాఠశాల కేంద్రంలో 235 మందికి 233 మంది హాజరయ్యారు. గర్భాం మోడల్ స్కూల్‌లో 206 మందికి పూర్తిస్థాయిలో హాజరయ్యారు.
- శృంగవరపుకోట పట్టణంలోని ఉన్నత పాఠశాలలో 168 మంది, బాలికోన్నత పాఠశాలలో 177 మంది, రవీంద్ర భారతి స్కూల్‌లో 156 మంది, నారాయణ స్కూల్‌లో 239 మంది పరీక్షలకు హాజరయ్యారు. నారాయణ స్కూల్ కేంద్రంలో ఒక విద్యార్థి హాజరు కాలేదు.
- గుర్ల మండలంలోని గుర్ల, కలవచర్ల, తెట్టంగి ఉన్నత పాఠశాలల్లోని పరీక్ష కేంద్రాల్లో 493 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైయ్యారని ఎంఈఓ ఎస్.భానుప్రకాష్ తెలిపారు. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ పద్మావతి, ఎస్ఐ హరిబాబు నాయుడు పరిశీలించారు.

– సాక్షి నెట్‌వర్క్

నేడు ఆసరా సంబరాలు


ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ భానోజీరావు, జైహింద్‌కుమార్

గంట్యాడ: స్థానిక కొఠారుబిల్లి జంక్షన్‌లో కనకదుర్గమ్మ ఆలయం వద్ద గంట్యాడ మండల స్థాయి వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలు మంగళవారం నిర్వహించనున్నారు. సంబంధిత ఏర్పాట్లను జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఈఓపీఆర్డీ భానోజీరావు సోమవారం పరిశీలించారు. సభకు వచ్చే మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా అన్ని ఏర్పాట్లు చేయాలని వెలుగు సిబ్బందికి సూచించారు. కార్యక్రమానికి గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. ఆసరా లబ్ధిదారులు అంతా పాల్గొని సంబరాలను విజయవంతం చేయాలని కోరారు.

పంచాయతీ పాలకవర్గానికి రెండేళ్లు పూర్తి


కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ సుధారాణి, ఉపసర్పంచ్ బెల్లాన శ్రీదేవి, వార్డు మెంబర్లు

చీపురుపల్లి: స్థానిక మేజర్ పంచాయతీ పాలకవర్గం ఏర్పడి సోమవారం నాటికి రెండేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో మేజర్ పంచాయతీ కార్యాలయంలో సోమవారం వేడుకలు నిర్వహించారు. సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఉపసర్పంచ్ బెల్లాన శ్రీదేవి, 20 మంది వార్డు మెంబర్‌లతో కలిసి కేక్ కట్ చేశారు. సర్పంచ్, ఉపసర్పంచ్‌లు మాట్లాడుతూ పాలకవర్గం బాధ్యతలు స్వీకరించి రెండేళ్లలో పంచాయతీని అభివృద్ధి పథం నడిపించామని మిగిలిన కాలంలో కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ, అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని చెప్పారు. మంగళగిరి శ్రీను, పంచాయతీ అధికారి ఝాన్సీ, సిబ్బంది రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం


మాట్లాడుతున్న ఎంపీపీ గోపెమ్మ

కొత్తవలస: చిరుధాన్యాలను రోజూ ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ అన్నారు. వియ్యంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కొత్తవలస కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన పౌష్టికాహార పక్షోత్సవం ముగింపు ఉత్సవాలకు అతిథిగా ఎంపీపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జొన్నలు, రాగులు, కొర్రలు, సామలు,ఉలవలు వంటి చిరుధాన్యాలు తినడం వల్ల అధిక బరువు నియంత్రణ, రక్తహీనత నివారణ, ఎముకుల ధృడత్వం అవుతాయని చెప్పారు. చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల శరీరానికి కావాల్సిన పోషకాలు అందుతాయని వివరించారు. గర్భిణులకు చిరుధాన్యాల ఆవశ్యకతను వివరించాలని సూచించారు. సీడీపీఓ రొంగలి ఉమాదేవి, ఏసీడీపీఓ బి.లక్ష్మీబాయి, సూపర్‌వైజర్స్ రామకృష్ణమ్మ, కె.వి.స్వర్ణలత, కె.రమణమ్మ, పి.భాగ్యలక్ష్మి, భాగ్యవతి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వేణుగోపాలస్వామి తిరుక్కల్యాణ సేవ

విజయనగరం టౌన్: సంతపేట జగన్నాథస్వామి ఆలయంలో కొలువైన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో పాంచాహ్నిక ధ్వజారోహణ తిరుక్కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అనంతరం తిరువీధి నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు పవన్‌స్వామి, టీటీడీ వేదపండితులు అనంత వెంకట జగన్నాథాచార్యస్వామి, ప్రసాద్‌శర్మ, నరసింహమూర్తులు ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం స్వామివారిని శేషవాహనంపై తిరువీధి నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు. 5న రథోత్సవం, 6న పూర్ణాహుతి కార్యక్రమాలు, గరుడ వాహన సేవ, 7న పుష్పాంజలి, పవళింపు సేవ ఉంటాయన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యకూ పరిష్కారం చూపండి


చీపురుపల్లి: వినతులు స్వీకరిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణరాజు, డిప్యూటీ తహసీల్దార్ సంతోష్


బొండపల్లి: మాట్లాడుతున్న ఎంపీపీ చలం నాయుడు


గజపతినగరం: మాట్లాడుతున్న ఎంపీడీఓ సుదర్శనం

బొండపల్లి: ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమంలో ప్రజలు అందించే ప్రతీ అర్జీని పరిశీలించి, అవకాశం ఉన్న మేరకు త్వరితగతిన పరిష్కారం చూపాలని మండల అధికారులకు ఎంపీపీ చల్లా చలం నాయుడు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపీడీఓ ఏ.వేదవతి, ఈఓపీఆర్డీ సుగుణాకరరావు, ఏపీఓ బి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'స్పందన'

చీపురుపల్లి: ప్రజాసమస్యల పరిష్కారానికే 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో సోమవారం స్పందన నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో జిల్లా కేంద్రంలోనే స్పందన కార్యక్రమం ఉండేదని, ప్రజల సౌకర్యార్థం కొద్ది రోజులుగా మండల స్థాయిలోనూ ప్రతీ సోమవారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఎవరైనా వినతులు అందించవచ్చు

గజపతినగరం: ఏ సమస్యపై అయినా, ఎవరైనా స్పందనలో వినతులు అందించవచ్చని ఇన్‌చార్జి ఎంపీడీఓ పప్పు సుదర్శనం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించారు. జిన్నాం గ్రామానికి చెందిన డప్పు కళాకారుడు తనకు పింఛన్ ఇప్పించాలని, గ్రీన్ అంబాసిడర్లు జీతాలు పెంచాలని వినతులు అందజేశారు.తహసీల్దార్ ఎం.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణం వేగవంతం చేయాలి


సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమైన డీఈ గోవిందరావు

చీపురుపల్లి: జగనన్న కాలనీల్లో ఇంకుడు గుంతలు (చోక్ పిట్లు) నిర్మాణం వేగవంతం చేయాలని ఆర్ డబ్ల్యూఎస్ డీఈ గోవిందరావు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న ప్రతీ ఇంటికి ఇంకుడు గుంత నిర్మాణం జరిగే విధంగా చూడాలన్నారు. వీటి వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. ఇళ్లల్లో వినియోగించే నీరు ఇంకుడు గుంతల్లో వెళ్లడం ద్వారా భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ఇంజినీరింగ్ అసిసెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వీటి నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. ఎంపీడీఓ కె.రామకృష్ణ రాజు, హౌసింగ్ ఏఈ సూర్యనారాయణ పాల్గొన్నారు.

సమ్మర్ క్రాస్ ప్రోగ్రాం ప్రారంభం


క్రాస్ ప్రోగ్రాం వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ ప్రమీల, జెడ్పీటీసీ అప్పలనాయుడు

గుర్ల: మండలంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యగా నిర్వహించే సమ్మర్ క్రాస్ ప్రోగ్రాం వాహనాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ పాట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో హ్యాండ్ బోర్లను పరిశీలించి, అవసరమైన వాటికి మరమ్మతులు చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పాట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, ఎంపీడీఓ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

చేకూరిన లబ్ధిని.. చేసిన మేలును వివరిద్దాం

- గృహసారథుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు


గుర్ల: కెల్లలో గృహసారథులకు 'జగనన్న నువ్వే మా భవిష్యత్' కిట్లను అందజేస్తున్న సూర్యనారాయణరాజు


చీపురుపల్లిరూరల్: నిమ్మలవలసలో గృహసారథులకు కిట్లు పంపిణీ చేస్తున్న చీపరుపల్లి మండల నాయకులు


చీపురుపల్లిరూరల్: కోనూరులో కిట్లు పంపిణీ చేస్తున్న గరివిడి మండల నాయకులు


బొండపల్లి: గొట్లాంలో గృహసారథులకు కిట్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కృష్ణ


దత్తిరాజేరు: గడసాంలో కిట్లు అందచేస్తున్న జేసీఎస్ కన్వీనర్ ఫణీంద్రుడు


వేపాడ: నీలకంఠరాజపురంలో గృహసారథులకు కిట్లు అందజేస్తున్న నాయకులు


లక్కవరపుకోట: వీరభద్రపేటలో కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు, తదితరులు


కొత్తవలస: నిమ్మలపాలెంలో దిశా నిర్దేశం చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నాయుడు

గుర్ల: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలకతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి, చేసిన మేలును ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని గృహసారథులకు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు సూచించారు. కెల్ల,గుజ్జంగివలస,గూడెం, పున్నపురెడ్డిపేట,పాలవలస, గరికివలసలో గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు.'జగనన్నే మాభవిష్యత్' కార్యక్రమం నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ప్రతీ ఇంటికి గృహసారథులు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, జరిగిన మేలును, గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులను వివరించాలని సూచించారు. అనంతరం 'జగనన్నే మా భవిష్యత్' కిట్లను అందజేశారు. పాట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, తోట తిరుపతిరావు పాల్గొన్నారు.

ఆ బాధ్యత గృహసారథులదే..

బొండపల్లి: ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించాల్సిన బాధ్యత గృహసారథులపై ఉందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈదుబిల్లి కృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ పల్లి రఘు అన్నారు.గొట్లాం,నెలివాడలో గృహసారథులకు 'జగనన్నే మాభవిష్య త్' కిట్లను సోమవారం పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ మీసాల సరోజిని, గొట్లాం పీఏసీఎస్ చైర్మన్ మహంతి రమణ, తాళ్లపూడి అప్పలనాయుడు, నెలివాడ సర్పంచ్ తాళ్లపూడి కీర్తి పాల్గొన్నారు.

చీపురుపల్లి, గరివిడి మండలాల్లో..

చీపురుపల్లిరూరల్: చీపురుపల్లి మండలంలోని రావివలస, మెట్టపల్లి, కర్లాం,నిమ్మలవలస, పత్తికాయవలస సచివాలయాలు, గరివిడి మండలంలోని శివరాం, కోనూరు, అర్తమూరు, దేవాడ, కె.ఎల్.పురం సచివాలయాల పరిధిలో గృహసారథులతో ఆయా మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం సమావేశమయ్యారు. 'జగనన్న నువ్వే మా భవిష్యత్' కార్యక్రమంపై దిశానిర్దేశం చేసి, కిట్లు పంపిణీ చేశారు. చీపురుపల్లి నాయకులు ఇప్పిలి అనంతం,వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, గరివిడి నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు, వైస్ ఎంపీపీలు గుడివాడ శ్రీరాములనాయుడు, జి.వెంకట అప్పలరాజు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పొన్నాడ కుమార్ పాల్గొన్నారు.

వేపాడ మండలంలో..

వేపాడ: మండలంలోని వావిలపాడు, నల్లబిల్లి, ఎన్.కె.ఆర్.పురం, వేపాడ తదితర గ్రామాల్లో గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లతో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు, జేసీఎస్ కన్వీనర్ బోజంకి శ్రీను ఆధ్వర్యంలో సోమవారం సమావేశాలు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించాలని సూచించారు. డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, ఏఎంసీ చైర్‌పర్సన్ మూకల కస్తూరి పాల్గొన్నారు.

కొత్తవలస,ఎల్.కోట మండలాల్లో..

కొత్తవలస/లక్కవరపుకోట: కొత్తవలస మండలంలోని ఉత్తరాపల్లి, మంగళపాలెం, తుమ్మికాపల్లి, కంటకాపల్లి, కాటికాపల్లి, కొత్తవలస–3 సచివాలయాల్లో మండల జేసీఎస్ కన్వీనర్ యడ్ల కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో గృహసారథుల సమావేశం నిర్వహించారు. ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఒబ్బినవాయుడు పాల్గొన్నారు. ఎల్.కోట మండలంలో జేసీఎస్ కన్వీనర్ బొంతల వెంకటరావు, ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వీరభద్రపేట,ఖాసాపేట తదితర గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు 'జగనన్న నువ్వే మా భవిష్యత్' కిట్లు అందజేశారు.

దత్తిరాజేరు మండలంలో..

దత్తిరాజేరు: చినకాద,గడసాం పెదమానాపురం గ్రామాల్లో గృహసారథులతో మండల జేసీఎస్ కన్వీనర్ మహదేవ్ ఫణీంద్రుడు గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. 'జగనన్న నువ్వే మా భవిష్యత్' కిట్లను పంపిణీ చేశారు. టి.భూర్జవలస సర్పంచ్ క్రాంతికుమార్, నాయకులు వెంకటరమణ, మురార్జీ, సుంకరి శివ పాల్గొన్నారు.